సాక్షి ప్రకాశం

శుక్రవారం | 21 | ఏప్రిల్ | 2023



ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. - 8లో..



బాబు సాక్షిగా టీడీపీలో వర్గపోరు

టీడీపీ అధినేత చంద్రబాబు సాక్షిగా ప్రకాశం జిల్లాలో నేతల మధ్య వర్గపోరు బహిర్గతమైంది. బాబు జన్మదిన వేడుకల్లో నేతల మధ్య పొరపచ్చాలు బయటపడ్డాయి. - 8లో..

గరిష్టం/కనిష్టం
43 /26

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది.
వాతావరణం పొడిగా ఉంటుంది.
ఉక్కపోత అధికం.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : సా॥ 06:31 ని॥
శుక్రవారం

సహర్ : ఉ॥ 04:28 ని॥
శనివారం

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన ఏకేయూ వీసీ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏకేయూ వైస్ చాన్సలర్ అంజిరెడ్డి

ఒంగోలు అర్బన్: కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌ను ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ (వీసీ) మారెడ్డి అంజిరెడ్డి గురువారం ప్రకాశం భవనంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అవసరమైన సహాయ, సహకారాలు అందించాలని కోరారు. ఈ విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ, పీజీ కోర్సులు ప్రారంభమవుతాయని కలెక్టర్‌కు తెలిపారు.

చందలూరు పీహెచ్‌సీ పరిధిలో 6 కరోనా కేసులు

దర్శి: మండలంలోని చందలూరు పీహెచ్‌సీ పరిధిలో 6 కరోనా కేసులు నమోదైనట్లు పీహెచ్‌సీ వైద్యురాలు బీ కిరణ్మయి తెలిపారు. అందులో మారెడ్డిపల్లిలో ఇద్దరు, చందలూరులో ఇద్దరు, కట్టశింగన్నపాలెంలో ఒక విద్యార్థికి కరోనా సోకింది. పులిమివారిపల్లిలో ఒక పెద్దవయస్సు వారికి కరోనా సోకింది. ఈ సందర్భంగా కిరణ్మయి మాట్లాడుతూ మొత్తం చందలూరు జెడ్పీ పాఠశాలలో 40 మందికి టెస్టులు చేశామని చెప్పారు. అందులో ఆరుగురికి కరోనా సోకిందన్నారు. గ్రామాల్లో మాస్కులు ధరించి కరోనాపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానితులు ఉంటే వెంటనే ఆస్పత్రిలో టెస్టులు చేయించుకోవాలని కోరారు.

జిల్లాలో 269 పాఠశాలలకు నైట్ వాచ్‌మన్‌లు

ఒంగోలు: జిల్లాలో 269 నాన్ రెసిడెన్షియల్ పాఠశాలలకు నైట్‌వాచ్‌మన్‌లను నియమిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మౌలిక వసతుల రక్షణ, పాఠశాల ఆవరణలోకి సంఘ విద్రోహ శక్తులు ప్రవేశించకుండా నిరోధించేందుకు, ప్రతి పాఠశాలకు ఒక నైట్ వాచ్‌మెన్‌ను నియమిస్తారన్నారు. ఇందుకుగాను వాచ్‌మెన్ వయస్సు తప్పనిసరిగా 60 సంవత్సరాల్లోపు ఉండాలని, పాఠశాలలో పనిచేసే ఆయా/కుక్ కమ్ హెల్పర్ భర్తకు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. గ్రామం/వార్డులోని మాజీ సైనికులకు రెండో ప్రాధాన్యత లభిస్తుంది. పై రెండు విభాగాల్లో ఎవరూ లేని పక్షంలో పేరెంట్స్ కమిటీ ఎవరినైనా నియమించవచ్చన్నారు. వీరికి నెలకు రూ.6 వేలు గౌరవ వేతనం చెల్లిస్తారని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ పేర్కొన్నారు.

మూసేసిన పాలకేంద్రాలు పునఃప్రారంభించాలి

- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు



సమావేశం నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: ఏదైనా కారణాలతో మూసివేసిన పాల కేంద్రాలను పరిశీలించి పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ప్రకాశం భవనంలో జగనన్న పాల వెల్లువ (జేపీవీ) అమలు, పురోగతిపై సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జేపీవీ అమలవుతున్న 16 మండలాల్లో మెరుగైన ఫలితాలు వచ్చేలా చూడాలన్నారు. రాబోయే రెండు వారాల్లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు.

పథకం లక్ష్యాలు చేకూరే లబ్ధి గురించి క్షేత్రస్థాయిలో విస్తృతంగా పాడి రైతులకు తెలియజేయాలన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి జగనన్న పాల వెల్లువ కార్యక్రమాన్ని లక్ష్యం మేరకు సాధించాలన్నారు. దీనిలో డీసీఓ పీ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, పశు సంవర్ధక శాఖ ఏడీ, అమూల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

హై.. హై బాబా

వెలిగొండపై మూడు దశాబ్దాలుగా చంద్రబాబు అదే అబద్ధం



ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాల ప్రజలకు వర ప్రదాయనిగా నిలిచిన వెలిగొండ ప్రాజెక్టుపై తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దాదాపు మూడు దశాబ్దాలుగా చెప్పిన అబద్ధానే తిరిగి చెబుతూ తన నైజాన్ని చాటుకుంటున్నారు. 2018 సంవత్సరంలో సీఎం హోదాలో జిల్లాకు వచ్చిన బాబు 2019 సంక్రాంతి నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు నీరందిస్తానని ఆర్భాటంగా ప్రకటించారు. అయితే వాస్తవానికి ఆయన పాలించిన ఐదేళ్ల కాలంలో ప్రాజెక్టుకు నిధులు కేటాయించింది అంతంత మాత్రమే. పనులు సైతం తన బినామీకి కేటాయించి నిధులు మింగేశారన్న ఆరోపణలు ఉన్నాయి. వెలిగొండపై వాస్తవాలు ఇలా..

- 2018లో సీఎం హోదాలో జిల్లాకు వచ్చి సంక్రాంతి తర్వాత ప్రాజెక్టుని ప్రారంభిస్తామని ఆర్భాటంగా ప్రకటన
- నిధుల కేటాయింపులు అంతంత మాత్రమే
- బినామీ ఎంపీ సీఎం రమేష్‌కు కాంట్రాక్ట్ అప్పగింత
- తిరిగి బుధవారం గిద్దలూరు వేదికగా వెలిగొండను మేమే పూర్తి చేస్తామంటూ మభ్యపెట్టే ప్రసంగం
- జిల్లా అభివృద్ధి విషయంలోనూ అదే తీరు..

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: మూడు జిల్లాల్లో శాశ్వతంగా కరువు నివారించి సాగు, తాగు నీరందించేందుకు చేపట్టిన పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం ఐదు దశాబ్దాల కింద పోరాటం మొదలైంది. ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా దీనిని పట్టించుకున్న దాఖలాల్లేవు. 1997లో చంద్రబాబు సమాధిరాయిలా శిలాఫలకాన్ని ఆవిష్కరించి చేతులు దులిపేసుకున్నారు. ఒక్క పైసా కూడా విదిలించలేదు. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఈ ప్రాజెక్ట్ పనులకు శ్రీకారం చుట్టారు. శ్రీశైలం ప్రాజెక్టులోని 43.58 టీఎంసీల కృష్ణానీటిని శ్రీశైలం వద్ద ఉన్న కొల్లం వాగు నుంచి 2 టన్నెల్స్ ద్వారా ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల్లోని 30 మండలాలకు అందించేందుకు ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ప్రాజెక్టు వల్ల 4,47,300 ఎకరాలకు సాగునీరు, 15.25 మంది లక్షల మందికి తాగు నీరు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. జలయజ్ఞంలో భాగంగా 2006లో వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించారు వైఎస్సార్. ఆయన హయాంలో రూ.1448.14 కోట్లు ఖర్చు పెట్టారు. పనులు సైతం వేగంగా జరిగాయి. ఆయన అకాల మరణం తర్వాత పనులు ముందుకు సాగలేదు. టీడీపీ హయాంలో 2014 నుంచి 2018 మధ్య కాలంలో కేవలం రూ.600 కోట్లు మాత్రమే కేటాయింపులు చేశారు. ఈ పనులను తన బినామీ ఎంపీ సీఎం రమేష్‌కు కేటాయించారు. ఇచ్చిన నిధులను సైతం మింగేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక ప్రాజెక్ట్ పనుల్లో అడుగు ముందుకు పడలేదు.

వైఎస్సార్ సీపీ హయాంలో ఇలా

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పోలవరం తర్వాత వెలిగొండకు అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం ప్రత్యేక దృష్టిసారించారు. రివర్స్ టెండరింగ్ ద్వారా గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిని అరికట్టి పనులు వేగంగా చేపట్టాలని ఆదేశించింది. తీగలేరు, గొట్టిపడియ, తూర్పు ప్రధాన కాలువ, ఉపకాలువలు, ఉదయగిరి ఉపకాలువ, పడమర ఉపకాలువ, టి–5 కాలువల పనులు పూర్తయ్యాయి. పునరావాసం పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు దాదాపు రూ.5,950 కోట్లు ఖర్చు చేసింది. రెండో దశ కోసం రూ.8052.10 కోట్లకు పరిపాలన అనుమతులిచ్చారు. ప్రాజెక్టు నిర్మాణం, భూ సేకరణ, పునరావాసం, అటవీ భూముల కోసం ఖర్చు చేస్తున్నారు. గత ఏడాది రూ.856.15 కోట్లు కేటాయించారు. ఈ నెల 12వ తేదీన సీఎం జగన్ మార్కాపురం వచ్చిన సందర్భంగా వెలిగొండపై కీలక ప్రకటన చేశారు వచ్చే సెప్టెంబర్ నాటికి పనులు పూర్తి చేసి అక్టోబర్ లో ప్రాజెక్టును ప్రారంభించేందుకు మళ్లీ వస్తానని జిల్లా వాసులకు హామీ ఇచ్చారు కూడా..

జిల్లా అభివృద్ధి విషయంలోనూ బాబు అదేపోకడను ప్రదర్శించారు. తన హయాంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిమ్జ్ ప్రాజెక్టుకు సంబంధించి కనిగిరి నియోజకవర్గంలో తూతూ మంత్రంగా భూములు పరిశీలించి వదిలేశారు. అలాగే దొనకొండ పారిశ్రామిక కారిడార్ అని, విమానాలకు అవసరమైన పరికరాలను ఇక్కడే తయారు చేసే పరిశ్రమను స్థాపిస్తున్నామంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు చేశారు. ఇలా ఐదేళ్ల పాలనను మాయమాటలతో వెల్లబుచ్చాడే తప్ప ప్రకాశం జిల్లాకు చేసిందేమీ లేదన్నది జగమెరిగిన సత్యమే.

మళ్లీ మళ్లీ అదే పాట..

వెలిగొండ ప్రాజెక్టుపై మూడు జిల్లాల ప్రజలను మోసగించేలా మూడు దశాబ్దాలు అబద్ధాలు చెబుతూనే ఉన్నారు చంద్రబాబు. 1997లో వెలిగొండ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేసిన చంద్రబాబు సర్వే పేరుతో ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించకుండా తన నైజాన్ని ప్రదర్శించిన విషయాన్ని జిల్లా ప్రజలు మరిచిపోలేదు. అంతెందుకు 2014 నుంచి 2019 వరకు ఐదేళ్ల తన పాలనలో ఐదు సార్లు ప్రకాశం జిల్లాకు వచ్చారు. వచ్చినప్పుడల్లా త్వరలో వెలిగొండను ప్రారంభించి పశ్చిమ ప్రకాశాన్ని సస్యశ్యామలం చేస్తానని హామీలు గుప్పిస్తూనే ఉంటారు. 2018 జూన్ నెలలో జిల్లాకు వచ్చిన చంద్రబాబు 2019 సంక్రాంతికల్లా వెలిగొండను పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తానంటూ ఆర్భాటంగా ప్రకటన చేశారు. ఎందుకంటే అప్పట్లో 2019 ఎన్నికలు త్వరలో వస్తాయని భావించి నోటికి ఏది వస్తే అది చెప్పుకూంటూ పోయారు. అధికారం పోయిన తరువాత మొన్న గిద్దలూరుకు వచ్చిన చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టుపై మళ్లీ పాత పాటే అందుకున్నారు. ఈ ప్రాజెక్టు విషయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విమర్శలు చేయడంపై జిల్లా వాసులు ముక్కున వేలేసుకున్నారు. తన హయాంలో వెలిగొండ ప్రాజెక్టును గాలికొదిలేసి నేడు వాస్తవాలను వక్రీకరిస్తూ విమర్శలు చేయడంపై జిల్లా వాసులు ఈసడించుకుంటున్నారు. చంద్రబాబు హయాంలో వెలిగొండ ప్రాజెక్టు పనులను తన బినామీకి నామినేషన్ మీద అప్పగించి వందల కోట్ల రూపాయలు దోచుకున్నది చంద్రబాబే అన్నది బహిరంగ రహస్యం. ఐదేళ్ల పాలనలో ఒకటో టన్నెల్‌ను కనీసం ఐదు కిలో మీటర్లు కూడా తవ్వని చంద్రబాబు తిరిగి అధికారాన్ని ఇస్తే వెలిగొండ పనులను పూర్తి చేస్తానని చెప్పటం విడ్డూరంగా ఉందని జనం అంటున్నారు.

బాబు సభలు వెలవెల

మార్కాపురం, మార్కాపురం టౌన్, తర్లుపాడు: టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు నాయుడు గురువారం మార్కాపురంలో నిర్వహించిన కార్యక్రమాల్లో కార్యకర్తలు, జనాలు లేక వెలవెలబోయాయి. గురువారం ఆయన జన్మదిన వేడుకలను మార్కాపురంలోని తర్లుపాడు రోడ్డులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై నిర్వహించారు. బస్సుదిగి 11 గంటలకు ఆయన వేదికపైకి రాగా ఆశించిన స్థాయిలో జనాలు లేక పోవటంతో అసహనానికి గురయ్యారు. హడావిడిగా కేక్ కట్‌చేసి మమ అనిపించి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి నేరుగా డయాస్‌పైకి వెళ్లారు. ఏదో కొత్తగా, నూతనంగా ప్రసంగం ఉంటుందని, మహిళలను ఉద్ధరించే పథకాలను ప్రకటిస్తాడని ఎదురు చూసిన మహిళలకు ఊకదంపుడు ప్రసంగమే వినాల్సి వచ్చింది. యాథావిధిగా ప్రతి సభలో చెప్పినట్లుగానే ఇక్కడ కూడా ఎన్టీ రామారావు హయాంలో అమలు చేసిన పథకాలు, తాను హైదరాబాద్ నగరానికి చేసిన అభివృద్ధిపై పదేపదే చెప్పటంతో మహిళలు లేచి బయటకు వెళ్లిపోయారు. భోజనాల వద్ద కూడా పూర్తి స్థాయిలో భోజనాలు అందక పోవటంతో పలువురు మహిళలు, కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేశారు. జన్మదిన వేడుకలకు వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి విద్యార్థులను పిలవటంతో పలు పాఠశాలలకు అప్రకటిత సెలవు ప్రకటించారు. జనాలను తరలించేందుకు ప్రైవేటు పాఠశాలల బస్సులను ఉపయోగించుకోవటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపలేదు.



చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు



చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయంలో బయటకు వెళ్లిపోతున్న మహిళలు

దళిత ద్రోహి చంద్రబాబు

- మహిళలు, దళితులకు ఏం చేశావు
- నీవు, నీ కుమారుడు ఎస్సీలను అవమాన పరిచేలా మాట్లాడలేదా
- ఎస్సీ నియోజకవర్గంలో ప్రవేశించే అర్హత మీకు ఉందా
- సూటిగా ప్రశ్నించిన రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న పురపాలక శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: అధికారంలో ఉన్నప్పుడు దళితులు, మహిళల అభ్యున్నతికి చంద్రబాబు నాయుడు ఏమీ చేయలేదని, వారిని అవమానాలకు గురిచేశాడని, ఇప్పుడు అండగా ఉంటానంటే నమ్మే పరిస్థితి ప్రజల్లో లేదని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ''దళితులుగా పుట్టాలని ఎవరు అనుకుంటారని నీవు అంటే, నీ కుమారుడు లోకేష్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి రోజునే దళితులు ఏమి పీకుతారు అని దళితులను అవమాన పరిచేలా మాట్లాడలేదా'' అని ఆయన ప్రశ్నించారు. యర్రగొండపాలెం నియోజకవర్గం మీ పార్టీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబును ''ఏ వృక్షంలేని చోట ఆముదం వృక్షమే మహా వృక్షమని'' నెల్లూరులో అవమాన పరచడం ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. సందర్భం వచ్చినప్పుడు ఏదో ఒక విధంగా దళితులను అవమాన పరచటమే చంద్రబాబు, ఆయన పార్టీ నాయకులు లక్ష్యంగా పెట్టుకున్నారని విమర్శించారు. దళితులు, మహిళలకు ఏం చేశారో ఆత్మ విమర్శ చేసుకోవాలని, ఇప్పుడు ఏ మొఖంపెట్టుకొని ఎస్సీ నియోజకవర్గంలో ప్రవేశిస్తావని, అందుకు తాము నిరసన తెలిపేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి అన్నారు. 14 సంవత్సరాలపాటు సీఎంగా కొనసాగిన చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారని, ఎన్నికలు సమీపిస్తున్నాయంటే ఏదో ఒక తాయిలం వేసి ఓట్లు గుంజుకోవడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. బురిడీ కొట్టించే బాబు మాటలు విని విసిగివేశారని, రాష్ట్ర ప్రజలు 2019లో జరిగిన ఎన్నికల్లో అడ్రస్ లేకుండా చేశారని ఆయన వ్యంగ్యంగా అన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్న సమయంలో 8 సార్లు జిల్లాలో పర్యటించారని, పశ్చిమ ప్రాంత వరప్రదాయని వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండా సంక్రాంతి, ఉగాది అని పండుగల పేర్లు చెప్పి కాలయాపన చేస్తూ వచ్చారని, గతంలో ఆ ప్రాజెక్టు పనులు ఏమేరకు చేశారని ప్రశ్నించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత వెలిగొండ ప్రాజెక్టు పనులు వేగవంతంగా చేపట్టారని, ఇటీవల ఈబీసీ నేస్తం ప్రారంభించటానికి మార్కాపురం వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సెప్టెంబర్ నెలలో ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని చెప్పారని, చిత్తశుద్ధి, నమ్మకం ఉన్న సీఎం కావడం వలన వెలిగొండ ప్రాజెక్టు గురించి స్పష్టమైన హామీ ఇచ్చారని అన్నారు. చంద్రబాబు కాలంలో ఏ మేరకు ప్రాజెక్టు పనులు జరిగాయి, జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత ఏ మేరకు ఈ పనులు ముందుకు సాగింది, అధికారిక గణాంకాల ద్వారా తెలుస్తున్నాయని, ఒక సారి ఆ రికార్డులు పరిశీలించుకోవాలని అన్నారు. ఎన్నికలు వస్తుండటం వలన జై ఎన్టీఆర్ అంటున్న బాబుకు ఆయనంటే అసలు గౌరవం లేదని, ఐదేళ్లపాటు అధికారంలో ఉండి ఎన్టీఆర్ జ్ఞాపకం ఉండే పని ఒక్కటి కూడా చేయలేదని ఆయన అన్నారు. పార్టీలకు అతీతంగా జగన్‌మోహన్‌రెడ్డి కృష్ణా జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టి తన హుందాతనాన్ని చాటుకున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎస్సీ నియోజకవర్గం అయిన యర్రగొండపాలెం అభివృద్ధి దిశలో నడుస్తోందని, పశ్చిమ ప్రాంత ప్రజల ఆరోగ్యం కాపాడటానికి మార్కాపురంలో మెడికల్ కళాశాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారని చెప్పారు. యర్రగొండపాలెంలో రూ.26 కోట్లతో 100 పడకల వైద్యశాలను నిర్మిస్తున్నారని, గిరిజన ప్రాంతమైన పెద్దదోర్నాలలో రూ.45 కోట్లతో గిరిజన మల్టీస్పెషాలిటీ వైద్యశాల పనులు ముందుకు సాగుతున్నాయన్నారు. తీవ్ర కరువు, కాటకాలతో అలమటిస్తున్న పుల్లలచెరువు మండల ప్రజలకు తాగు, సాగు నీరు అందివ్వటానికి తీగలేరు కాలువ పనులకు రూ.83 కోట్లు మంజూరు చేశారని, పల్నాడు జిల్లా వరికపుడిసెల ప్రాజెక్టును పుల్లలచెరువు మండలం ప్రజలకు నీరు అందివ్వటానికి నిధులు మంజూరు చేశారని అన్నారు. టీడీపీ పాలనలో ఎస్సీ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలన్న ఆలోచన లేకుండా పోయిందని విమర్శించారు. సమావేశంలో ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదురి విజయభాస్కర్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కె.ఓబుల్‌రెడ్డి, పుల్లలచెరువు మండల జెడ్పీటీసీ వాగ్యానాయక్, శ్రీశైలం దేవస్థానం కమిటీ మాజీ డైరెక్టర్ ఐ.వి.సుబ్బారావు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములునాయక్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గాలి మూటి దేవప్రసాద్, ప్రధాన కార్యదర్శి బి.బాలచెన్నయ్య, సర్పంచ్‌లు ఆర్.అరుణాబాయి, జి.సుబ్బారెడ్డి, కె.వెంకటేశ్వరరెడ్డి, నాయకులు ఎన్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, పబ్బిశెట్టి శ్రీనివాసులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఒంగోలు నగరంలో వేగంగా అభివృద్ధి పనులు
- సంక్షేమం, అభివృద్ధి చేశాం కనుకే ప్రతి గడపకు వెళుతున్నాం
- అబద్ధాలు చెప్పకుంటూ జిల్లాలో చంద్రబాబు పర్యటిస్తున్నాడు
- వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి
- రూ.40 లక్షలతో పార్కు, వాకింగ్ ట్రాక్ పనులకు భూమి పూజ

ఒంగోలు సబర్బన్: ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి చెప్పారు. ఒంగోలు నగరంలోని 32వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బాలినేని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దలగుంట ఎక్స్‌టెన్షన్ నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గద్దలగుంటలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందుతున్న తీరును స్వయంగా బాలినేని అడిగి తెలుసుకున్నారు. ఒంగోలు నగరంతో పాటు నియోజకవర్గంలోని అన్ని సమస్యలను పరిష్కరించటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ప్రజల ఇబ్బందులు ఏమైనా ఉంటే నా ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయన్నారు. ఒంగోలు నగరంలో వేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అందుకే ధైర్యంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై ఆరా తీస్తున్నామన్నారు. గద్దలగుంటలో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టామని, ఇంకా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇప్పటికే ఒంగోలు నగరంలో 13 డివిజన్లు పర్యటించామని, ప్రస్తుతం 32వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వెల్లడించారు. చంద్రబాబు నాయుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అప్పులు చేస్తుందని అసత్య ప్రచారం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. జిల్లాలో తిరుగుతున్న చంద్రబాబు అబద్ధాలు చెప్పుకుంటూ పర్యటిస్తున్నాడని విమర్శించారు. తాను అధికారంలో ఉన్నప్పుడు పూర్తి చేయలేని వెలిగొండ ప్రాజెక్టు పనులను మళ్లీ అధికారం ఇస్తే పూర్తి చేస్తాననటాన్ని ప్రజలు విశ్వసించటం లేదని పేర్కొన్నారు. చంద్రబాబు నోట అబద్ధాలు తప్ప ఏనాడూ నిజాలు మాట్లాడిన దాఖలాలు లేవన్నారు.

రూ.40 లక్షలతో చేపట్టనున్న పనులకు భూమిపూజ:

డివిజన్ పరిధిలో రాజీవ్ నగర్ ఎక్స్‌టెన్షన్‌లో పార్కు అభివృద్ధి పనులకు బాలినేని శ్రీనివాస రెడ్డి భూమి పూజ చేశారు. రూ.40 లక్షలతో చేపట్టనున్న ఈ పనులకు కొబ్బరికాయకొట్టి ప్రారంభించారు. పార్కుకు ప్రహరీగోడ, స్థానిక ప్రజలకు వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులను తొలుత ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ఈ డివిజన్లో ఇప్పటి వరకు రూ.2.50 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. మరో రూ.1.50 కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. రూ.1.50 కోట్ల ఉడా నిధులతో మామిడిపాలెం ఎస్ఎస్ ట్యాంకుతో పాటు పరిసరాలను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. పురుషులు, మహిళలకు విడివిడిగా జిమ్‌లు, సోలార్ లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, 32వ డివిజన్ కార్పొరేటర్ తాడి కృష్ణలత, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, వేమూరి సూర్యనారాయణ, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు కఠారి శంకర్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంటా రామానాయుడు, కార్పొరేటర్లు గోలి లక్ష్మీ కోటేశ్వరమ్మ, ఈదర సురేష్ బాబు, చల్లా తిరుమలరావు, చింతపల్లి గోపీ చంద్, శ్రీరాం నాగభూషణం, నాగం వెంకట శేషయ్య, పసుపులేటి శ్రీనివాసరావు, ట్రేడ్ యూనియన్ నాయకులు పుచ్చకాయల గోవర్ధన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చావల శ్రీనివాస రావు, బొమ్మినేని మురళి, తూము పద్మ, మీరావలి, 32వ డివిజన్ నాయకులు డివిజన్ అధ్యక్షుడు కోసూరి శేఖర్, తోటపల్లి సోమశేఖర్, చిట్టెం సురేష్, మన్నే పల్లి అంకబాబు, జువ్విశెట్టి వెంకట్రావు, నత్తల బీమేష్, గాజుల సాయి, ఓగిరాల వెంకట్రావు, తోటపల్లి వెంకటేష్, గరికపాటి గోపాల కృష్ణతో పాటు పలువురు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిప్స్ ప్యాకెట్ కొనివ్వలేదని..

చొక్కాకు నిప్పుపెట్టుకున్న బాలుడు



తీవ్రంగా గాయపడిన సుభాష్

బేస్తవారిపేట: మండలంలోని బాలేశ్వరపురంలో తల్లిదండ్రులు చిప్స్ ప్యాకెట్ కొనేందుకు డబ్బులు ఇవ్వలేదని చొక్కాకు నిప్పు పెట్టుకుని గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన తలారి జయరావు కుమారుడు 11 ఏళ్ల సుభాష్ శింగరపల్లెలో ఏడో తరగతి చదువుతున్నాడు. చిప్స్ ప్యాకెట్ కొనేందుకు డబ్బులు ఇవ్వమని తల్లిదండ్రులను కోరాడు. నగదు ఇవ్వకపోవడంతో ఇంట్లో ఉన్న అగ్గిపెట్టె తీసుకుని షర్ట్‌కు నిప్పు పెట్టుకున్నాడు. షర్ట్ కాలిపోవడంతో ఒకవైపు శరీరం కాలిపోయింది. గట్టిగా కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు మంటలను ఆర్పి గలిజేరుగుళ్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. 108లో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

పక్కాగా 'ఫ్యామిలీ డాక్టర్'

- వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్ స్పష్టీకరణ

ఒంగోలు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించే గ్రామంలో ముందు రోజు దండోరా వేయించాలని సూచించారు. ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ చేయాలని చేపట్టిన ఈ కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో నిర్వహించాలని చెప్పారు. సర్వే సమయంలో ప్రజల వాస్తవ రుగ్మతలను మాత్రమే యాప్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసే సిబ్బంది మొత్తం సకాలంలో ప్రభుత్వం గుర్తించిన ప్రదేశాల్లో మాత్రమే ముఖ హాజరు వేయాలన్నారు. ప్రోగ్రాం అధికారులు పీహెచ్‌సీలు, సచివాలయాల్లో ముఖ హాజరును పర్యవేక్షించాలని చెప్పారు. గ్రామాల్లో గర్భిణులను గుర్తించి, 12 వారాల్లోలోగా రిజిస్ట్రేషన్ చేసి టీటీ మొదటి మోతాదు, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. హైరిస్క్ గర్భిణులను ముందస్తుగా గుర్తించి తగిన వైద్యసేవలు అందించాలన్నారు. నాడు-నేడు, ఫ్యామిలీ డాక్టర్, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, 49 ఫీవర్ సర్వే, అనీమియా ముక్త్ భారత్, డైట్ సర్వే, బర్త్ ప్లానింగ్, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, డీసీహెచ్‌ఎస్ మూర్తి, జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్, క్షయ నివారణ అధికారి సురేష్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ తిరుమలరావు, కనిగిరి, మార్కాపురం, ఒంగోలు ఉప వైద్యాధికారులు, నోడల్ అధికారి మాధవీలత, ప్రోగ్రాం అధికారులు, డేటా మేనేజర్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

జగనంటే నమ్మకం



మా మంచి మామయ్య.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాన్ని ముద్దాడుతున్న చిన్నారులు



మమకారం.. ఒంగోలు ఇందిరమ్మ కాలనీలో మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్‌ను అంటిస్తున్న పింఛనుదారులు పీరాబీ, నాగూర్‌బీ



వర్ధిల్లు కలకాలం.. చీమకుర్తి కేవీపాలెం రోడ్డులోని జగన్న కాలనీలో సొంతింటి కల నెరవేర్చిన సీఎం జగన్ చిత్రపటానికి పుష్పాభిషేకం

పసి హృదయాల నుంచి పండు ముసళ్ల వరకు సీఎం వైఎస్ జగన్‌పై అభిమానం చెక్కు చెదరలేదు. రుణ భారం తప్పించి, ఉపాధికి చేయూతనిస్తూ, వ్యాపారానికి ఆసరాగా నిలుస్తూ సొంత అన్నలా ఆదరిస్తున్న నాయకుడికి అక్క చెల్లెమ్మలు జేజేలు పలుకుతున్నారు. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన సీఎం జగన్‌పై విద్యార్థులు అభిమానాన్ని చాటుకుంటున్నారు. సొంతింటి స్వప్నం నెరవేరడంతో పేద, మధ్య తరగతి కుటుంబాల్లో సంతోషం వెల్లివిరుస్తోంది. సంక్షేమ ఫలాలు అందుకున్న వారు 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను స్వచ్ఛందంగా ఇళ్లకు అంటించుకుంటున్నారు.

- సాక్షి, ఒంగోలు



భవితకు భరోసా.. స్కూల్ బ్యాగులపై మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్ అంటించిన విద్యార్థినులు



ఫ్యాన్సీ.. ఒంగోలు గంటాపాలెంలో చేయూత పథకం సొమ్ముతో గాజుల దుకాణం నిర్వహిస్తున్న కుంచాల అంజమ్మ



రుణపడి ఉంటాం.. ఒంగోలు గంటాపాలెంలో మా నమ్మకం నువ్వే అంటూ సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మదీనా స్వశక్తి సంఘం మహిళలు



ఉపాధికి ఆసరా.. ఒంగోలు మంగళపాలెంలో పేపర్ ప్లేట్ మెషీన్‌కు జగనన్న స్టిక్కర్ అంటిస్తున్న ఆసరా పథకం లబ్ధిదారు పాదర్తి సునీత

బాబు సాక్షిగా టీడీపీలో వర్గపోరు

- యర్రగొండపాలెం నియోజకవర్గంలో బహిర్గతమైన కొట్లాటలు
- వేర్వేరుగా చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు
- దామచర్ల జనార్దన్ వైఖరిపై మండిపడుతున్న నేతలు



మన్నె రవీంద్ర ఇంట్లో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు



టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎరిక్షన్‌బాబు వర్గం నేతలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: టీడీపీ అధినేత చంద్రబాబు సాక్షిగా ప్రకాశం జిల్లాలో నేతల మధ్య వర్గపోరు బహిర్గతమైంది. చంద్రబాబు జన్మదినం సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో కూడా పచ్చ నేతల మధ్య పొరపొచ్చాలు బయటపడ్డాయి. యర్రగొండపాలెంలో చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను పార్టీ నేతలు గురువారం వేర్వేరుగా నిర్వహించారు. నియోజకవర్గంలో అంతంతమాత్రంగా ఉన్న టీడీపీ నాయకులు, కేడర్ నాలుగు గ్రూపులుగా విడిపోయారు. నియోజకవర్గంలోని పార్టీలో అంతర్గత కుమ్ములాటలపై సాక్షి ముందుగానే పసిగట్టింది. గురువారం సంచికలో »భగ్గుమంటున్న పచ్చగడ్డి« శీర్షికతో కథనం ప్రచురించింది. దీనికి తగ్గట్లే అధినేత చంద్రబాబు పుట్టినరోజు వేడుకల్లో కూడా వర్గ పోరు ఆగలేదు, మనస్పర్థలు తారాస్థాయికి చేరుకున్నాయి. నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు తన వర్గంతో కలిసి పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. రెండో వర్గానికి నాయకత్వం వహిస్తున్న జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ డాక్టర్ మన్నే రవీంద్ర పార్టీ కార్యాలయంలో జరిగిన చంద్రబాబు పుట్టినరోజు వేడుకలకు వెళ్లలేదు. రవీంద్ర ఇంట్లోనే తన క్యాడర్‌ను పిలిపించుకొని కేక్ కట్ చేసి వేడుకలు చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్ రాజు అసలు అడ్రస్సే లేదు. గత ఎన్నికల్లో పోటీచేసి ఓటమి పాలైన బూదాల అజితారావు ఆ దరిదాపుల్లో కనిపించలేదంటే నియోజకవర్గ టీడీపీలో ఏ స్థాయిలో అంతర్గత కుమ్ములాటలు ఉన్నాయో అర్థమవుతోంది.

అప్పటి నుంచి అదే తంతు..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2014లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర వ్యాప్తంగా తొలిసారిగా ఎన్నికల బరిలో దిగే సమయంలోనే పాలపర్తి డేవిడ్ రాజుకు యర్రగొండపాలెం టిక్కెట్ ఇచ్చి పోటీ చేయించారు. ఆ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా విజయం సాధించిన డేవిడ్‌రాజు..చంద్రబాబు నోట్లకు అమ్ముడై టీడీపీలో చేరిపోయాడు. కానీ అనుకున్నంత డబ్బులు మూటలు ఇవ్వకుండా చంద్రబాబు మోసం చేశారంటూ బహిరంగంగానే తన అనుచరుల ముందు వాపోయినట్లు తెలుస్తోంది. అక్కడితో డేవిడ్ రాజు రాజకీయానికి ఫుల్‌స్టాప్ పడ్డట్టే అయింది.

దామచర్ల వైఖరిపై ఆగ్రహం..

నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే దామచర్ల పెత్తనాన్ని సైతం నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని వర్గపోరులో కూడా తలదూర్చి ఎరిక్షన్ బాబు వర్గానికి మద్దతు పలకటంతో మిగతా గ్రూపుల నాయకులు దామచర్లపై దుమ్మెత్తి పోస్తున్నారు. జిల్లా కేంద్రంలోని నాయకులతోనే సఖ్యత లేకుండా ఒంటెత్తు పోకడలతో వెళుతున్న దామచర్ల యర్రగొండపాలెం రాజకీయంలో వేలు పెట్టడాన్ని బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఎరిక్షన్ బాబుకు అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తే టీడీపీ రెబల్స్‌గానైనా బరిలో నిలుస్తామని మిగతా మూడు గ్రూపులకు చెందిన నేతలు బహిరంగంగానే ప్రకటిస్తున్నారు.

వరకట్న వేధింపుల కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు

ముండ్లమూరు: అదనపు కట్నం కోసం భార్యను వేధించిన కేసులో నిందితుడు కైపు ఇంద్రసేనారెడ్డికి 498 సెక్షన్ కింద రెండేళ్ల జైలు, రూ.4 వేల జరిమానా, 323 సెక్షన్ కింద ఏడాది జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ దర్శి జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జీవీఎల్ సరస్వతి తీర్పు వెలువరించినట్లు ఎస్సై ఎల్.సంపత్‌కుమార్ తెలిపారు. మండలంలోని రెడ్డినగర్‌కు చెందిన కైపు వెంకటలక్ష్మి తన భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నట్లు 2018లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. గురువారం దర్శి కోర్టులో తుది విచారణ చేపట్టిన న్యాయమూర్తి.. నిందితుడిపై నేరారోపణ రుజువు కావడంతో శిక్ష విధించారని పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్కే జహీర్ అహ్మద్ వాదించారు.

ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్సీ పోతుల సునీత, కలెక్టర్ దినేష్‌కుమార్



ఇఫ్తార్ విందు నమాజులో పాల్గొన్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మత పెద్దలు,

ఒంగోలు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉందని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక పాడిబండ్ల గోపాలస్వామి కళ్యాణ మండపంలో రాష్ట్ర ముస్లిం వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్‌విందులో ఆయన పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి మగరిబ్ నమాజులో పాల్గొన్నారు. అనంతరం బాలినేని మాట్లాడుతూ ముస్లింలకు గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇవ్వనంత ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ముస్లింలకు అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. ఇఫ్తార్ విందులు కులమతాలకతీతంగా సోదర భావాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్సీ పోతుల సునీత చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముస్లింకు పెద్దపీట వేస్తున్నారని, ఒక డిప్యూటీ ముఖ్యమంత్రి, నలుగురు ఎమ్మెల్యేలు, నలుగురు ఎమ్మెల్సీలతో పాటు అనేక కార్పొరేషన్, నామినేటెడ్ పదవులు ఇచ్చి రాజకీయంగా ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటిసారిగా ముస్లింలకు మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవిని ఇచ్చిన ఘనత ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. చంద్రబాబు ముస్లింను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకున్నారని, ఒక్క ముస్లింను కూడా మంత్రి పదవి ఇవ్వకుండా గత ఎన్నికలకు నాలుగు నెలల ముందు మంత్రి పదవి ఇచ్చి ముస్లింలకు ద్రోహం చేశారని విమర్శించారు. అంబేడ్కర్ వారసుడిగా, పూలే ఆశయాల వారసుడిగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీల అభ్యున్నతికి పాటుపడుతున్నారని చెప్పారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల మనోభావాలను గౌరవిస్తూ వారి అభివృద్ధి, సంక్షేమానికి పని చేస్తుందన్నారు. సమాజహితం కోరుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు చేసే ఉపవాసాలు ఎంతో నిష్టగా ఉంటాయన్నారు. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ పోతుల సునీత, కలెక్టర్ దినేష్‌కుమార్‌లు ముస్లింలకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, మైనార్టీ వెల్ఫేర్ శాఖ ఈడీ కె.ధనలక్ష్మి, డీఎండబ్ల్యూఎస్ జి.అర్చన, బీసీ సంక్షేమాధికారి అంజల, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మహబూబ్, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మహ్మద్ బాషా, నూర్‌బాషా కార్పొరేషన్ డైరెక్టర సోఫియా, కార్పొరేటర్లు ఇమ్రాన్ ఖాన్, ఇంతేజార్, నూర్జహాన్ జాకిర్, ఫాతిమున్, వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి శంకర్, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, మైనార్టీ సెల్ రీజనల్ కో ఆర్డినేటర్ సయ్యద్ జలీల్, తబ్లిగ్ జమాయత్ జిల్లా బాధ్యులు సయ్యద్ హమీద్, మత పెద్దలు పాల్గొన్నారు.

కూలీల ట్రాక్టర్ బోల్తా

- 10 మందికి గాయాలు



గాయపడిన గంగమ్మ



గాయపడిన కోటమ్మ

కొనకనమిట్ల: మిర్చి కోతలకు వెళ్లి వస్తుండగా ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో 10 మంది కూలీలకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని గార్లదిన్నె వద్ద గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాలు.. కందివారిపల్లెకు చెందిన పగడాల లక్ష్మీరెడ్డికి చెందిన ట్రాక్టర్‌లో కూలీలను గార్లదిన్నెలో వారి బంధువుల తోటలో మిర్చి కోతకు తీసుకొచ్చారు. పని ముగిశాక ఇంటికి వెళ్లే క్రమంలో అతివేగం కారణంగా గార్లదిన్నె మూల మలుపు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి ట్రక్కు బోల్తా పడింది. ట్రక్కులో ఉన్న 25 మంది కూలీలు చెల్లాచెదురుగా పడిపోయారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను మార్కాపురంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. వారిలో అంగిరేకుల గంగమ్మ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తీసుకెళ్లారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై దీపిక పరిశీలించి వివరాలు సేకరించారు. ప్రమాదానికి గల కారణాలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



బోల్తా పడిన ట్రాక్టర్ ట్రక్కు



108లో గాయపడిన వారికి చికిత్స